23

# దుఃఖం

ఎనిమిది రోజులు దాటింది..

కర్ఫ్యూ -

నగరం బంధీఖానాలో.. మనుషులు ఇండ్లలో సమాధి.. వీధుల్లో నిశ్శబ్దం.. అంతా శ్మశానం, మిలిటరీ వ్యాన్ టైర్లు కీచుమని అరుస్తూ ఆగిన ధ్వని.. అర్ధరాత్రి.

టక్ టక్ టక్.. బూట్లు, ఇనుప బూట్ల.

తుపాకుల వాసన.. ఖాకీ బట్టల వాసన. రాత్రి...... నిర్మానుష్యమైన రోడ్లపై కవాతు .... గోడల్లోపల బిక్కుబిక్కుమంటున్న చూపులు..... గడగడలాడుతున్న గుండెలు......... పాతాళగంగలా చిమ్ముకొచ్చే కన్నీళ్ళు.

- పిల్లల ఏడ్పులు.. ఆకలితో జ్వలిస్తున్న కళ్ళు.. కోటి ప్రశ్నలతో దీనాతిదీనమైన పసివాళ్ళ చూపులు...

"అమ్మా ఆకలి..."

" తల్లీ పాలు.."

లేవు.. లేవు.. ఎండిపోయిన స్తనాల్లో పాలు లేవు బాబూ. ఇవిగో నా కన్నీళ్ళు తాగు.

తండ్రి గుండెల్లో మౌనంగా బ్రద్దలౌతున్న అగ్నిపర్వతం.. బిగుసుకుంటున్న పిడికిళ్ళలో ఒట్టి నిస్పృహాయత.

ఎందుకీ శిక్ష.. ఎవరికీ శిక్ష.. ఎవరివల్ల ఎవరికి శిక్ష. ఎవరు ఎవరిని చంపుకుంటున్నారు. ఎందుకు చంపుకుంటున్నారు ?

ఎవరు ఎవరిని చంపిస్తున్నారు. ఎందుకు చంపిస్తున్నారు.

వెర్రి రాజకీయాలు.. ఎవరి పదవులు. ఎవరి ప్రాణాలు పోవడాలు.

ఎవరు మంత్రులు....

ఎవరు అధికారులు... ఏది ప్రజాస్వామ్యం.. ఏమిటీ అరాచకం.

పసివానికి కావలసిన గుక్కెడు పాలకోసం ప్రాణాలు ఆరిపోయే దీపంలా రెపరెపమంటున్నప్పుడు ఏదీ సంజాయిషీ.

కన్నీళ్ళు. రోదనలు. దుఃఖం.. గోడలు ఏడుస్తున్నాయి.

రోడ్లు కన్నీళ్ళతో తడుస్తూ..... ప్రవాహాలు..

టక్ టక్ టక్ - బూట్లు. కన్నీళ్ళపై నుండి కవాతు.

సిపాయి తలలో డైనమైట్లు ప్రేలుతున్నాయి. ఎలుగెత్తి వినిపిస్తున్న ఆకలి రోదన వినబడుతోంది.

చూపులు ఆలోచలను చీల్చుకుంటూ చీకట్లోకి దూసుకుపోతున్నాయి.

సరిహద్దు భద్రతాదళం.. దాంట్లో సిపాయి. తెలుగు సిపాయి.

ఎక్కడున్నది సరిహద్దు... హద్దు..

ఏది భద్రత.. ఎక్కడి భద్రతను కాపాడాలి.

రోబోట్.. మరమనిషి.. చెప్తే వినే మరమనిషి.

మీటనొక్కగానే చెప్పినట్టుచేసే మర మనిషి. రోబోట్‌కు హృదయం ఉండదు.

తనొక రోబోటా?

ఎదురుగా కనబడుతున్నది. జరుగుతున్నది అన్యాయమని తెలిసీ...

గూండాలు స్వైరవిహారం చేస్తున్నారు. వీధులను ధ్వంసం చేస్తున్నారు. ఆస్తులను తగులబెడ్తున్నారు. బీభత్సం జరుగుతోంది.

వాళ్ళను కాల్చమనడం లేదు ప్రభుత్వం.. నాయకులు. వ్యాన్‌లలో స్టెన్‌గన్‌లతో కూర్చున్న తను చూస్తున్నాడు... ఎవరైతే తమను పిలిపించారో వాళ్ళే ఈ విధ్వంసం చేయిస్తూ.. జనాన్ని భయభ్రాంతులను చేసి, కకావికలుచేసి, ఆందోళనను సృష్టించి కళ్ళనిండా మతం బురద పులిమి..

వెనుక ఎయిర్ కండిషన్డ్ కార్లలో మంత్రి.. ఆజ్ఞలు.

ముందర జీపుల్లో మోహరించిన పోలీసాఫీసర్ల వలయం... అధికార మదం.

చెల్లాచెదురుగా పరుగెత్తే జనం. మంటలు.. పొగలు.. కేకలు.. అరుపులు. రోదనలు. తొక్కిసలాట.

నగరం అంటుకుంది - మంత్రి నవ్వుతున్నాడు.

సిపాయి మెదడు కాలిపోతోంది.

తను చిన్ననాడు తన గ్రామం నుండి దేశరక్షణ కోసం మిలిటరీలో చేరడానికి బయలుదేరబోతున్న రోజు దుర్మార్గానికి మారోపేరైన తమ సర్పంచ్ .. ఎదిగి ఎదిగి.. ఇప్పుడు మంత్రి -

అప్పుడు తమ ఊరికి ఎస్.ఐ.గా ఉండి రేప్‌లు, అవినీతి తిండ్లు, పేద ప్రాణాల అపహరణ.. వీటికి రిప్రజెంటేటివ్ ఐన వ్యక్తి ఇప్పుడు, ఎదుట తమను శాసించడానికి పోలీస్ ఎస్పీ -

దేశ రక్షణలో మునిగి తను పద్దెనిమిదేళ్ళు ఈ సంఘానికి దూరంగా జరిగి - ఇప్పుడు తిరగొచ్చే సరికి తోడేళ్ళు ఎంత బలిసిపోయాయి.

చేతుల్లో ఉన్న స్టెన్‌గన్ ఎదుట ఒకే ప్రశ్న.

ఎవరిని రక్షించాలి. ఎవరిని శిక్షించాలి.

చదువురాని వాడు, రాజ్యాంగం తెలియనివాడు, న్యాయం, ధర్మం.. చట్టం, పాలన - వీటి నిర్వచనాలు తెలియనివాడు తన బ్రతుకు కోసం దేశాన్ని అమ్మేస్తూ.... నాయకులై, మంత్రులై... సంఘాన్ని గూండాల కప్పగిస్తూ.

అధికారులు గులాములై, వ్యక్తిత్వాలను చంపుకుని జీ హుజూర్‌గాళ్ళై తమ సుఖం కోసం ఎవని కాళ్ళయినా పట్టుకోడానికి సిద్ధపడి,

థూ.....

తనకు తెలిసిన దొంగలు.. ఇప్పుడు తనను శాసించే వాళ్ళయితే,

తను మరమనిషా ..... రోబోటా

మెదడులో ఎడతెగని డైనమెట్ల ప్రేలుడు ..... విస్ఫోటనం.

" ఫైర్ " ఆర్డర్

- ఎవడు ఆర్డర్ ఇచ్చువాడు. న్యాయం మీదకు అన్యాయం చేసే ఆజ్ఞలను ఆత్మలు అంగీకరించవు.

"ఫైర్"

తుపాకులు ప్రేలడం లేదు. వేం మరమనుషులం కాదు. మాకు హృదయాలున్నాయి.

స్టెన్‌గన్ వెనక్కు తిరిగి కళ్ళు తెరిచింది

డ్ డ్ డ్ డ్ డ్ .. గుళ్ళు దూసుకుపోతున్నాయి.

మంత్రి చచ్చాడు, ఎస్పీ చచ్చాడు, ఎమ్మెల్యే చచ్చాడు, యింకా రాజకీయులు నేల కూలుతున్నారు.

రక్తం ప్రవహిస్తోంది. నేల మళ్ళీ పునీతమౌతున్నది.

ఆమె.... ఎవరో నడిచి వస్తోంది రోడ్డుపై.

దేశమాత పాదాలు నడిచి వస్తున్నాయి.

కన్నీళ్ళలోనుండి,

దుఃఖంలో నుండి.. ఆక్రందనల్లో నుండి. ఆర్తనాదాల్లో నుండి.

చేతులు ఆమె పాదాల దగ్గర తన తుపాకీని అర్పించి..

సిపాయి తలవంచుకుని నిలబడి....

"తల్లీ ఈ దేశం నిండా తోడేళ్లను విశృంఖలంగా బ్రతకనిస్తూ వీళ్ళకు కాపలాదారున్నై బ్రతకలేను"

కోట్లమంది ఈ దేశ నిర్మాతలైన విద్యార్థులను ఎవరు శాసిస్తున్నారు.?

విద్య అంటేనే తెలియనివారు.

వైద్య మంటే తెలియనివారు వైద్యశాఖామంత్రులయి, శాసననిర్మాతలై, విధాన నిర్ణయాలు చేస్తూ..

ఎక్కడకుపోతున్నారు మేధావులు?

పరిశ్రమల నిండా పనిదొంగలైన కార్మికులు.. వాళ్ళకు రక్షణగా నిలిచే కార్మిక సంఘాలు....

విశ్వవిద్యాలయాల్లో గురువులను తన్ని డిగ్రీలు తీసుకునే యువతరం, వీధుల్లో గూండాయిజం.. హత్యలు, మానభంగాలు.

నిజాయితీగా నిలబడే ఉద్యోగిని కక్షతో మానసిక హత్యకు గురిచేసే పైరవీల కంపు.

వేశ్యాగృహాలు, కన్నీళ్ళ పరిమళాలు. వాటికి లైసెన్స్‌లు

అంగడి బొమ్మగా స్త్రీని చేసి - స్త్రీని పవిత్రంగా పూజించే దేశమని సిగ్గులేని బుకాయింపు.

నడవడం, మాట్లాడడం నేర్పకుంటే మనిషి పశువులా ఎదిగి ఎన్నడూ పలుకకుండా దారితప్పినట్టు,

ఈ తరాన్ని క్రమశిక్షణలో, మనిషిగా మనిషికోసం మనిషి బ్రతకాలన్న లక్ష్యంలో,ఈ దేశం కోసం, ఈ ప్రజల కోసం తను జీవించాలన్న పవిత్ర అర్పణలో ఎవరూ నడిపించడం లేదు.. ఈ తరం పథభ్రష్టమై పోతున్నది.

ఎవనిదయ్యా ఈ దేశం.. ఎవనిదయ్యా ఈదేశం.

ఈ ఇల్లునాది. ఈ ఉద్యోగంనాది... ఈ పెళ్ళాం నాది.

ఆ వేశ్యనాది... ఆ సుఖం నాది.. సుఖవ్యాధి నాది.

కానీ ఈ దేశం మాత్రం ఎవడిదో -

ఈ రోజు సుఖాన్నిచ్చి, ఈ రోజు విస్కీ తాగించి, ఈ రోజు కష్టపడకుండా నాకు లంచాలనిస్తే చాలు, కావలిస్తే ఈ దేశాన్ని నీకు కుదువబెడ్తా,

జీ హుజూరంటా.. యస్సర్ అంటా

తర్వాత "బోలో స్వతంత్ర భారత్‌కీ జై"

జైహింద్ - గప్‌చిప్‌గా కళ్ళుమూసుకుని నిద్రపోండి.

తల్లీ క్షమించు ,

ఈ రాక్షసులకు, ఈ తోడేళ్ళకు, ఈ దొంగలకు, ఈ బద్మాష్‌లకు, ఈ పైరవీకార్లకు, ఈ పిరికిమందు తాగిన మేధావులకు, సాహసించి ముందుకు రాని మంచి దుర్మార్గులకు, కుళ్ళిపోతున్న ఈ తరానికి ఇంకా నేను కాపలాకాయలేను. రక్షకుడుగా వ్యవహరించలేను.

ఆమె పాదాల దగ్గర స్టెన్‌గన్ మౌనంగా ఉంది. సిపాయి కళ్ళనుండి రక్తం ధారలుగా కారుతోంది. నగరం వీధుల నిండా నిశ్శబ్దం.. కర్ఫ్యూ. దేశం బందీయై పోయింది.

'ఉదయం' వారపత్రిక

తేది : 14-08-1986